
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
నిర్మల్ జిల్లా వార్తలు
8
మంగళవారం 23 సెప్టెంబరు 2025



ప్రశాంతంగా పరీక్షలు

నిర్మల్‌రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ పదో, ఇంటర్మీడియట్ పరీక్షలు, తెలంగాణ ప్రభుత్వ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీఈడీ పరీక్షలు జిల్లా కేంద్రంలో సోమవారం ప్రశాంతంగా జరిగాయి. పదోతరగతి పరీక్షల్లో 47 మందికి గాను 33 మంది హాజరు కాగా, ఇంటర్మీడియట్ పరీక్షలలో 41 మందికి 25 మంది హాజరయ్యారు. అదే విధంగా డీఈడీ పరీక్షలకు 54 మందికి గాను 52 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ పరమేశ్వర్ తనిఖీ చేశారు.

శైలపుత్రిగా సరస్వతీ అమ్మవారు


శైలపుత్రి రూపంలో బాసర సరస్వతీ అమ్మవారు

బాసర, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున పండితుల ఆధ్వర్యంలో మహాభిషేక పూజ నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్త పద్ధతిలో ప్రత్యేకపూజలు, హోమాలు జరిగాయి. ప్రారంభోత్సవ పూజల్లో ఆలయచైర్మన్ శరత్‌పాఠక్, ఈవో అంజనాదేవి పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఉత్సవాల మొదటిరోజు రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు, దుర్గామాత మాలాధారులు, సరస్వతీ దీక్షదారులు పాల్గొని పూజల్లో పాల్గొన్నారు. పాదయాత్రగా విచ్చేసిన భక్తులు జైసరస్వతీ మాతా నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ధర్మాబాద్ వ్యాపారులు భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేయగా, దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారి అనుగ్రహం కోసం క్యూలో నిలబడి దర్శనం పొందారు. ఉత్సవాల తొలిరోజు అమ్మవారు శైలపుత్రి రూపంలో భక్తులకు దర్శనిమచ్చారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారిని పండితులు శాస్త్రోక్త పూజలతో అభిషించగా, హాజరైన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఖరీఫ్ కొనుగోళ్లకు రంగం సిద్ధం



- జిల్లాలో 351 కొనుగోలు కేంద్రాలు
- అందుబాటులో 25 లక్షలు గన్నీ బ్యాగులు
- మరో 52 లక్షల బ్యాగుల సేకరణకు చర్యలు
- అక్టోబర్ మూడో వారం నుంచి కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ఏర్పాట్లు

నిర్మల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్‌కు సంబంధించి వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను చేపట్టేందుకు అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేస్తోంది. కొనుగోలు కేంద్రాల గుర్తింపుతో పాటు వాటి ఏర్పాటుకు పనులు మొదలయ్యాయి. ఈ ఏడు ఖరీఫ్‌లో 1,27,225 ఎకరాల్లో వరిసాగు చేశారు. దీనికి సంబంధించి దిగుబడి 2,10,065 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశారు. కాగా కొనుగోళ్లకు సంబంధించి మొత్తం 52 లక్షల గన్నీ బ్యాగులు అవసరం కానున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం 25 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండగా, మిగతా వాటికై ప్రయత్నాలు మొదలుపెట్టారు. అక్టోబర్ మొదటి వారం లేదా నాలుగో వారం నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు నిర్ణయించారు.

జిల్లాలో 351 కొనుగోలు కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా మొత్తం 351 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో నుంచి 173 కొనుగోలు కేంద్రాలను ఐకేపీ ద్వారా అలాగే మరో 149 కొనగోలు కేంద్రాలను పీఏసీఎస్ ద్వారా ఏర్పాటు చేయనున్నారు. డీసీయంయస్ పరిధిలో 24, డీసీసీ పరిధిలో ఐదింటిని ఏర్పాటుచేసేలా నిర్ణయించారు. మరోవైపు రైతుల డిమాండ్ మేరకు అవసరమైన చోట్ల అదనపు కొనుగోలు కేంద్రాలను కూడా ఏర్పాటు చేయనున్నారు.

పెరగనున్న సన్నరకం కొనుగోళ్లు

కాగా ఖరీఫ్‌లో 1,27,225 ఎకరాల్లో వరిధాన్యం పంటను సాగు చేస్తుండగా ఇందులో నుంచి దిగుబడి 2లక్షల మెట్రిక్ టన్నులకు పైగా రావచ్చని భావిస్తున్నారు. అయితే ఇందులో దొడ్డురకం ధాన్యం దిగుబడి పెద్దమొత్తంలో ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇందులో దొడ్డరకం 1,48,959 మెట్రిక్ టన్నులు కాగా, సన్నరకం 61,106 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందంటున్నారు. సన్నరకం ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పలు నిబంధనలు ఉండడంతో ఆ పంట కొనుగోళ్ల ప్రక్రియ అధికారులకు తలనొప్పిగా మారవచ్చటున్నారు.

గత బోనస్‌పై సందిగ్ధత..

గత యాసంగి సీజన్‌కు సంబంధించిన బోనస్ డబ్బులు రైతులకు ప్రభుత్వం ఇప్పటి వరకు చెల్లించకపోవడంతో వారంతా అయోమయానికి గురవుతున్నారు. ఈ సారి కూడా సన్నరకం ధాన్యానికి సంబంధించి క్వింటాల్‌కు రూ.500 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తామని చెబుతుండగా దీనిపై రైతులు విశ్వాసం వ్యక్తం చేయడం లేదు. గత యాసంగికి సంబంధించి 4,483 మంది రైతులకు రూ.12.80 కోట్లు బోనస్‌గా చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం గత బోనస్ డబ్బులు చెల్లిస్తే ఆశలు రెట్టింపవుతాయని అంటున్నారు.

భైంసాలో.. ధూంధాంగా..



వర్షంలో సైతం..


భైంసాలో బతుకమ్మలతో యువతులు


సాయినగర్‌లో బతుకమ్మకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు


బతుకమ్మ ఆడుతున్న మహిళలు


బతుకమ్మతో చిన్నారి

- వాడవాడలో ఆడిపాడిన ఆడపడుచులు
- జోరువానలోనూ వేడుకలు
- గంగమ్మ ఒడికి చేరిన గౌరమ్మలు
- ఆడపడుచులతో ఆడిపాడిన ఎమ్మెల్యే పవార్ రామారావ్


భైంసాలో బతుకమ్మ వేడుకల్లో ముథోల్ ఎమ్మెల్యే


బతుకమ్మలతో ఆడపడుచులు

భైంసా, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రామరామ రామ ఉయ్యాలో... రామనేసి ఉయ్యాలో... ఇద్దరక్కచెల్లెండ్లు ఉయ్యాలో... ఒక్క ఊరికిచ్చిరి ఉయ్యాలో.. చిత్తూ చిత్తుల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ... ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ.. తంగేడు పువ్వొప్పునే గౌరమ్మ.. అటూ తీరొక్క పాటలతో భైంసా మున్సిపల్ కేంద్రం మురిసిపోయింది. రంగు రంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో మెరిసిపోయింది.. పండుగ వాతవరణం వెల్లివిరిసింది. సోమవారం మున్సిపల్ కేంద్రమైన బతుకమ్మల నిమజ్జనోత్సవం కన్నుల పండువగా కొనసాగింది. ఉదయం వేళ నుంచి ప్రారంభమైన వేడుకలు పొద్దుపోయేదాక ఆడపడుచుల ఆటపాటలతో జోరుగా..హుషారుగా కొనసాగింది. కోలాట నృత్యాలు ... దాండియా ఆటలతో సందడి చేశారు. మధ్యలో జోరు వాన కురిసి ఆటంకం కలిగినా మహిళలు ఎంత మాత్రం తగ్గకుండా హుషారుగా వేడుకలను కొనసాగించారు. పొద్దుపోయే వరకు ఆడిపాడి చివరగా ఇక్కడి గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేశారు. వెళ్లిరా.. బతుకమ్మ...మళ్లీ రావమ్మ.. అంటూ సాగనంపారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. కొంత మంది మహిళలు గొడుగుల రక్షణలో బతుకమ్మలను నిమజ్జనానికి గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు తరలివచ్చారు ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ సోమవారం భైంసాలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. నెత్తిన పట్కా చుట్టుకొని బతుకమ్మను నెత్తిన ఎత్తుకొని మహిళలతో ఆడిపాడారు. కోలాటాలు వేసి కాసేపు నృత్యం చేసారు. బతుకమ్మల నిమజ్జనానికి బృందాలుగా తరలివచ్చిన మహిళ మండలీలకు భైంసా మున్నూరుకాపు మిత్ర మండలి గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద స్వాగతం పలికింది. మిత్ర మండలి అధ్యక్షుడు గాలి రవి నేతృత్వంలో మండలి సభ్యులు మహిళ మండలీల ప్రతినిధులకు వేదిక మీదకు ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. భైంసా హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు పెండెపు కాశీనాథ్ నేతృత్వంలో సమితి శ్రేణులు స్థానిక ఏపీ నగర్ కాలనీ పరిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి బతుమ్మల నిమజ్జనోత్సవ శోభయాత్రను ప్రారంభించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా గ్రీవెన్స్‌డే

● ఎస్పీ జానకీషర్మిల


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్‌టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) :ప్రజాసమస్యల పరిష్కారానికి వేదికగా గ్రీవెన్స్‌డే ఉందని ఎస్పీ జానకీషర్మిల అన్నారు. జిల్లా పోలీసు ముఖ్యకార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డే కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ మాట్లాడుతూ... ప్రజలకు పోలీసుసేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. గ్రీవెన్స్‌డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందన్నారు. గీవెన్స్ డేలో వచ్చిన ప్రతి ఫిర్యాదుపైన సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసి, ఫాలో అప్ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరుగకుండా పర్యవేక్షణ చేస్తామని హామీ ఇచ్చారు. పారదర్శకంగా పనిచేయడమే తమ ప్రధాన లక్ష్యం అని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

● కలెక్టర్ అభిలాష అభినవ్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ అబిలాష అబినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బతుకమ్మ పండుగ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నవరాత్రుల్లో ప్రతి రోజు బతుకమ్మ వేడుకలు వైభవంగా జరగాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమ తమ కార్యాలయాల్లో సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పండుగ జరపాలని, సద్దుల బతుకమ్మ రోజు ఊరేగింపులో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. సద్దుల బతుకమ్మకు ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ మాసంకు సంబంధించిన గోడ ప్రతిని అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆర్డీవో రత్న కళ్యాణి, డీఆర్డీవో విజయలక్ష్మి, డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, డీపీవో శ్రీనివాస్, డీఈవో భోజన్న, డీపీఆర్‌వో విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

ఈవీఎంల గోదాం పరిశీలన...

కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎంల గోదాంను పరిశీలించారు. గోదాంలో భద్రపరచిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను తనిఖీ చేసి రిజిస్టర్లను పరిశీలించారు.

పర్యావరణ విద్య బ్రాండ్ అంబాసిడర్‌గా మోహన్ రావు

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ విద్య బ్రాండ్ అంబాసిడర్‌గా ఎన్‌జీసీ సమన్వయకర్త డి.మోహన్ రావును నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ఎన్‌జీసీ డైరెక్టర్ డబ్ల్యూ జి ప్రసన్న కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. ఆ నియామక ఉత్తర్వులను సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి డి.భోజన్న చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా డీఈవో భోజన్న, మోహన్ రావును అభినందిస్తూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో పర్యావరణ విద్యలో భాగంగా, పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నివారణ, సుస్థిర అలవాట్లపై అవగాహన కార్యక్రమా లు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు పర్యావరణం పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు.

వాగు దాటుతూ మహిళ మృతి


లక్ష్మీబాయి (ఫైల్)


సుద్దవాగులో పరిశీలిస్తున్న ఎస్పీ జానకీషర్మిల

భైంసారూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బిజ్జూర్ నుంచి బబుల్‌గాం వెళ్లే మార్గంలో వాగు దాటుతున్న సమయంలో ఎడ్ల బండి ప్రమాదవశాత్తు కొట్టుకుపోయింది. ఎడ్ల బండిలో ఉన్న వృద్ధ మహిళ లక్ష్మీబాయి కూడా ప్రవాహంలో కొట్టుకుపోయి మృతిచెందింది. బండిపై ఉన్న సురేష్, ఒక ఎద్దు మాత్రమే బయటపడ్డాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మాటేగాం గ్రామానికి చెందిన సురేష్, బిజ్జూర్ గ్రామానికి చెందిన తన యజమాని నగేష్‌రెడ్డి చెప్పడంతో వ్యవసాయపనుల నిమిత్తం ఎడ్లబండి, బర్రెతో పొలాలకు బయలుదేరాడు. మార్గమధ్యంలో గంటోళ్ల లక్ష్మీబాయి (65) అనే వృద్ధ మహిళ తాను కూడా అదే వైపు వెళ్తున్నానని ఎడ్లబండిపై ఎక్కి వెళ్లింది. బుల్‌గాం వెళ్లే మార్గంలో వాగు దాటుతున్న సమయంలో ఎడ్లబండి ప్రమాదవశాత్తు కొట్టుకుపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఎస్పీ డా.జి. జానకి షర్మిల వాగుప్రాంతాన్ని సందర్శించి, సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్పీతో పాటు భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్, ఇన్‌స్పెక్టర్ నైలు, ఎస్సై సుమంజలి, ఏఎస్సై మారుతి, రెస్క్యూ టీం ఉన్నారు.


ఆరోగ్య కేంద్రం ఎదుట నిలిచిన నీరు

భైంసా : పట్టణ పరిధిలో సోమవారం రాత్రి భారీవర్షం కురిసింది. ఏకబిగిన గంట పాటు కురిసింది. వర్షపు నీటితో పలు వార్డులలోని అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. మురికి కాలువలు పొంగి పొర్లి ప్రవహించాయి. పట్టణ పరిధిలోని ఏ కాలనీలో చూసిన వర్షపు నీటి ప్రవాహమే కనిపించింది.

లోకేశ్వరం : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చెరువును తలపించేలా దర్శనమిస్తుంది. రోగులు నానా ఇబ్బందులు పడవలసి వస్తుందని స్థానికులు వాపోతున్నారు.

కొలువుదీరిన దుర్గామాతలు


కుంటాలలో దుర్గామాతకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు


నందిగుండం దుర్గామాత ఆలయంలో భక్తులకు భవాని మాలధారణ వేస్తున్న దృశ్యం


లోకేశ్వరంలో కొలువుదీరిన దుర్గామాత


నర్సాపూర్(జి) డొంగుర్‌గాంలో కొలువుదీరిన దుర్గామాత



ముథోల్‌లో కొలువుదీరిన దుర్గామాత


భైంసాలో కొలువుదీరిన దుర్గాదేవి


దిలావర్‌పూర్‌లో

యాదిలో..



బతుకమ్మ వచ్చిందంటే మా ఇంట పండగనే..

: సంగీత, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, బోథ్

బతుకమ్మ పండుగ వచ్చింది అంటే మా ఇంటిలో పండగనే. ప్రతీరోజు సాయంత్రం మా ముగ్గురు అక్కచెల్లెళ్ళం కలిసి మా కాలనీలో ఉండే ఆడపిల్లలతో కలిసి రాత్రి 9 గంటల వరకు ఆడి పాడేవాళ్లం. బతుకమ్మ నిమజ్జనం కోసం ప్రత్యేకంగా సిద్ధమయ్యే వాళ్లం. పూల కోసం ప్రతిరోజు ఉదయం సమీపంలోని ఇందులోకి వెళ్లి పెరటిలో పెంచుతున్న పూల మొక్కల నుండి పూలను తీసుకువచ్చే వాళ్లం. అంతేగాక నిమజ్జనం అంటే మా కాలనీ అంతా పండుగలా ఉండేది.



ఊరూ.. వాడా.. అంతా కదిలే వాళ్లం

: ఒర్సి లక్ష్మీ, ముత్యంపేట, బజార్‌హత్నూర్

బతుకమ్మ పండుగ సందర్భంగా ఊరూవాడా కదిలే వాళ్లం. బతుకమ్మ పండుగను తొమ్మిది రోజుల పాటు బావి చుట్టూ స్థానికంగా దొరికే పూలతో చప్పట్ల చప్పుల్ల మధ్య పండగ ఘనంగా జరుపుకునే వాళ్లం. సంబరాలలో తంగేడు, బంతి, గునుగు పువ్వులను సేకరించి వాటిని అందంగా పేర్చి బతుకమ్మలను తయారు చేసేవాళ్లం. ప్రతీ సాయంత్రం బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి, పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ చేస్తుండే వాళ్లం.



బతుకమ్మను సంప్రదాయబద్ధంగా ఆడేవాళ్లం

: శిరీషారెడ్డి, ఈజీఎస్ ఏపీవో, ముథోల్

బతుకమ్మ అంటే ఎంతో ఆసక్తి. చిన్నప్పుడు ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ మండలం సోనాల గ్రామమైన మా అమ్మ వారి ఇంటి వద్ద తోటి స్నేహితులతో కలిసి 15 రోజులు బతుకమ్మను ఎంతో ఆసక్తితో సంప్రదాయ బద్ధంగా ఆడేవాళ్లం. ఇంటి ముందట గుంత తవ్వి బతుకమ్మను రాత్రి సమయంలో 15 రోజులు ఆడి.. ఆ పూలను గుంతలో వేసేవాళ్లం. చివరి రోజు గునుగు పూలు, తంగేడు పూలు చేనుకు వెళ్లి తీసుకొచ్చి పెద్ద బతుకమ్మ తయారు చేసేవారిమి.





ఉట్నూర్ పోలీసుల అదుపులో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

లంబాడా నాయకులను అడ్డుకున్న పోలీసులు

ఉట్నూర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): లంబాడా హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడి చేసి ధర్నా నిర్వహించడానికి వెళ్తున్న లంబాడా హక్కుల పోరాట సమితి నాయకులను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం బయలుదేరిన ఉట్నూర్ మండల కేంద్రానికి చెందిన నాయకులను వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్‌చౌహాన్ ఆధ్వర్యంలో బంజారా నాయకులు హైదరాబాద్ బయలుదేరామన్నారు. ఉట్నూర్ ఎస్సై మార్గ మధ్యంలో తమను అరెస్టు చేసి హైదరాబాద్ వెళ్లకుండా అడ్డుకున్నారన్నారు. ఉట్నూర్ పోలీసు స్టేషన్‌లో నాయకులకు నిరబంచచడం సరైంది కాదని భరత్‌చౌహాన్ ఖండించారు. ఆయన వెంట పవర్ గంగారాంనాయక్, జాదవ్ మధుకర్‌నాయక్, చంద్రకాంత్‌నాయక్, కాశీనాథ్‌రాథోడ్, ఆడే రవీందర్‌లున్నారు.

బ్యాటరీల చోరీ నిందితుడు రిమాండ్

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): టీఫైబర్ చోరీ నిందితుడు పైతానే ధన్‌రాజ్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. జూలై, ఆగస్టు నెలలో గుడిహత్నూర్ మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన పైతానే ధన్‌రాజ్ నేను టి ఫైబర్‌లో పని చేస్తున్నానని గ్రామ పంచాయతీ సిబ్బందికి మాయమాటలు చెప్పి మల్లాపూర్, పిప్రి గ్రామ పంచాయతీల నుంచి ఆరు బ్యాటరీలు, సరికొండ కొండాపూర గ్రామ పంచాయతీ నుంచి మూడు, గుడిహత్నూర్ మండలం రాఘవపూర్ గ్రామ పంచాయతీ నుంచి మూడు బ్యాటరీలు మొత్తం 12 బ్యాటరీలను దొంగిలించాడని అనుమానం వ్యక్తం చేస్తూ టీ ఫైబర్ ఫీల్డ్ మేనేజర్ చిట్యాల రాజు ఆగస్టు నెల 18న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు నిందితుడి కోసం గాలించి సోమవారం పైతానే ధన్‌రాజ్ అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. పైతానే ధన్‌రాజ్ బ్యాటరీలను దొంగిలించి గుడిహత్నూర్ మండలంలోని తోషం గ్రామానికి చెందిన షేక రహీంకు అమ్మినట్లు తెలిపారు. దీంతో బ్యాటరీలను కొనుగోలు చేసిన షేక్ రహీంపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ తీగ తెగి పడి ఆవు మృత్యువాత

జైనథ్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెల్గావ్ గ్రామంలో ఆదివారం సాయంత్రం విద్యుత్ తీగ తెగిపడి ఆవుమృతి చెందింది. గ్రామస్థులు, రైతుల కథనం ప్రకారం.. బెల్గావ్ గ్రామానికి చెందిన రైతు పర్దేశి మహేశ్ అనే రైతు యొక్క ఆవు ఆదివారం మంద నుంచి ఆవు ఇంటి పశువుల పాకకు వచ్చే క్రమం గ్రామం నుంచి 33/11కేవీ విద్యుత్ వైరు ఉరుములు మేరుపుల గాలితో తెగిపడి ఆవుపై పడడంతో ఆవు అక్కడి అక్కడే మృతి చెందింది. ఆవు రోజుకు 20 లీటర్ల పాలతో తన జీవనం కొనసాగేదని ఆవు విలువ రూ.60వేల వరకు ఉంటుందని రైతు మహేశ్ తెలిపారు. రైతు ఫిర్యాదు మేరకు పశువైద్యాధికారి పంచనామా నిర్వహించారు.

ర్యాగింగ్ భూతానికి ఉట్నూర్ విద్యార్థి బలి

● సీనియర్ల ర్యాగింగ్‌తో విద్యార్థి ఆత్మహత్య ● హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ చదువుతున్న విద్యార్థి



సాయితేజ (ఫైల్)

ఉట్నూర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రక్త పరీక్షలు నిర్వహిస్తూ జీవితం గడుపుతున్న జాదవ్‌ప్రేమ్‌సింగ్ తన పిల్లలు కూడా తనలాగా పేదరికం జీవితాలు గడప వద్దని భావించి కష్టాలను ఓర్చుకుంటూ కొడుకును ఇంజనీరింగ్ చదివిస్తున్న ఆ తండ్రికి చివరికి కన్నీరే మిగిలింది. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలో డీఎంఎల్‌టీగా రక్త పరీక్షలు నిర్వహిస్తూ లక్కారం పంచాయతీలోని వేణునగర్‌లో నివసిస్తున్న ప్రేవ్ ఎసింగ్ తన కుమారుడు జాదవ్‌సాయి తేజను ఉట్నూర్ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం చదివించాడు. ఆ తర్వాత ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ వరకు చదివించి.. ఆ తర్వాత హైదరాబాద్‌లోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజిలో ప్రస్తుతం బీటెక్ చదివిస్తున్నాడు. అయితే,చ కళాశాలకు సమీపంలోనే ప్రైవేట్ హాస్టల్లో ఉంటున్న సాయితేజను కొంతమంది సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేయడంతో పాటు వారు చేసుకున్న మందు పార్టీకి బిల్లు రూ.10 వేలు చెల్లించాలని ఒత్తిడి చేశారు. దీంతో గిరిజన విద్యార్థి హాస్టల్లో ఉరి వేసుకుని ఆదివారం రాత్రి బలవన్మరణానికి పాల్పడినట్లు తెలుస్తుంది. మేడిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని నారపల్లిలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజి సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేసి కొట్టడం వల్ల, రూ.10 వేలు బిల్లు కట్టాలని వేధించడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తుంది. విషయం తెలియగానే తల్లిదండ్రులు హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. కాగా, మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తండ్రి ప్రేమ్‌సింగ్ తెలిపాడు. తన కుమారుడి ఆత్మహత్యకు కారణమైన సీనియర్ విద్యార్థులపై చట్టపరమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని ఆయన కోరుతున్నారు. ఇదిలా ఉండగా కళాశాల యాజమాన్యం బాధిత కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహా రం చెల్లించాలని, బాధిత కుటుంబంలో ఇంట్లో ఒకరికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, లేనట్లయితే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు పూనుకోవాల్సి వస్తుందని లంబాడీ జేఏసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ నరేష్‌యాదవ్, బానోతు జగన్ నాయక్, బానోత్ రామారావు, నేతావత్ రాందాస్‌లు డిమాండ్ చేశారు. లక్కారం మాజీ సర్పంచ్ మురుసుకుల తిరుపతి సైతం కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

● ఇంజనీరింగ్ విద్యార్థి మృతిపై ఆందోళన

ఉట్నూర్: హైదరాబాద్ రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని వసతి గృహంలో ర్యాగింగ్ వల్ల ఆత్మహత్యకు పాల్పడిన గిరిజన విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలంటూ లంబాడీ గిరిజనులు సోమవారం ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు ఉట్నూర్ మాజీ జడ్పీటీసీ చారులత రాథోడ్ ఆధ్వర్యంలో బాధిత విద్యార్థి తండ్రి ప్రేమ్‌సింగ్‌జాదవ్‌ను వెంటబెట్టుకుని ధర్నా నిర్వహించారు. ర్యాగింగ్ చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సోమేష్‌జాదవ్, తదితరులున్నారు.

● నిందితులను కఠినంగా శిక్షించాలి : లంబాడా ఐక్య వేదిక

నేరడిగొండ: ర్యాగింగ్ భూతానికి బలైన విద్యార్థి జాదవ్ సాయితేజ మృతికి కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని లంబాడి ఐక్య వేదిక ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ అన్నారు. సోమవారం ఆయన మండలకేంద్రంలో మాట్లాడుతూ నిందితులు ఎవరైనా, ఎంతటివారైనా చట్టపరమైన కఠిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగని పక్షంలో జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

గంజాయి మొక్కలు స్వాధీనం

తాంసి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తాంసి మండలం గిరిగావ్‌కు చెందిన తొడసం గోపాల్ ఇంటిపై జిల్లా ఆబ్కారీ శాఖ అధికారులు ఆదివారం సాయంత్రం దాడి చేశారు. ఇంటి ఆవరణలో పెంచిన రూ.50 వేల విలువైన గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో సీఐ అక్బర్ హుస్సేన్, సిబ్బంది రవీందర్, అరవింద్, శార ద, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ ఉపాధ్యాయుడికి సన్మానం

ఉట్నూర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆదివాసీ టీచర్ తొడసం కైలాస్ ఇటీవల రాష్ట్రపతి విందుకు హాజరై గౌరవ మన్ననలు అందుకోవడంతో సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని సన్‌షైన్ పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఆదివాసీ ప్రముఖ రచయిత మరియు ఉపాధ్యాయులు పీఎంమన్‌కి బాత్‌లో ప్రశంసలు అందుకున్న తులసికైలాస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కైలాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంటే నిరంతర విద్యార్థిగా ఉండాలని, నూతన టెక్నాలజికి అనుగుణంగా టీచర్ల బోధన ఉండాలని సూచించారు.

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి

నేరడిగొండ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే నివాసంలో బజార్ హత్నూర్ మండలంలోని భూతాయి ఓ గ్రామస్థులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి గ్రామంలో ఉన్న సమస్యలు బోథ్ ఎమ్మెల్యేకు విన్నవించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సానుకూలంగా స్పందించి త్వరలో గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం

బోథ్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఈనెల 24నుంచి సోనాల మండల కేంద్రంలో రామాలయ కమిటీ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. పాత కమిటీ రద్దు కావడంతో బ్రహ్మోత్సవాలను ఎవరు నిర్వహిస్తారు అనే విషయమై చర్చ కొనసాగింది. దీంతో గ్రామస్థులు మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ సూచన మేరకు తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేశారు.

రిజర్వేషన్ల ఖరారుపై.. కసరత్తు

(5వ పేజీ తరువాయి...)



మావల జీపీ కార్యాలయం

కనిపిస్తుంది. పార్టీల వారీగా అభ్యర్థులను ఎన్నికల బరిలో నిలిపేందుకు నేతలు ముందుచూపుతో వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే మండలాలు, గ్రామాల వారీగా అభ్యర్థుల జాబితాలు సిద్ధమైనట్లు సమాచారం. ఏ సామాజిక వర్గానికి రిజర్వేషన్ కలిసివస్తే ఎవరిని బరిలోకి దింపాలన్న పక్కాప్లాన్‌తో ముందుకెళ్తున్నారు. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయితే పల్లె రాజకీయా లు మరింత రసవత్తరంగా మారనున్నాయి. స్థానిక ఎన్నికల్లో కూడా సత్తా చాటేందుకు పార్టీల వారీగా కార్యకర్తలు సిద్ధమవుతున్నారు. గ్రామాల్లో పలుకుబడి ఉన్న నేతలకు ఆఫర్ చేస్తూ సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీలను గెలిపించుకొని రావాలని నేతలు ఆదేశిస్తున్నారు. క్షేత్రస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేస్తూ పంచాయతీ ఎన్నికల్లో గెలిచేందుకు వ్యూహరచన చేస్తున్నారు.



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సాకెర సమీపంలో ప్రైవేట్ బస్సు బోల్తా

బోథ్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సోనాల మండలంలోని సాకెర గ్రామం సమీపంలో సోమవారం సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో బెంగళూరు నుంచి నేపాల్‌కు వెళుతున్న ప్రైవేట్ బస్సు సర్వీసు రోడ్డు పక్కన బోల్తా పడింది. సంఘటనలో దాదాపు 56 మందికి స్వల్ప గాయాలయ్యాయి. అయితే సంఘటన విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులతో పాటు రెండు అంబులెన్సులు సంఘటన స్థలానికి చేరుకున్నాయి. కాగా, బస్సులో దాదాపు 150 మంది ప్రయాణిస్తున్నట్లు సమాచారం. అయితే గాయాల పాలైన వారిని ఆసుపత్రికి తీసుకు వచ్చేందుకు వెళ్లిన రెండు అంబులెన్స్‌లో ఆసుపత్రికి వచ్చేందుకు క్షతగాత్రులు నిరాకరించారు. సుదూర ప్రాంతాల నుంచి వెళుతున్న వీరంతా ఆసుపత్రికి వచ్చి వైద్యం చేయించుకుంటే పోలీస్ కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందని ఆసుపత్రికి రాలేదని తెలిసింది. గత రెండు సంవత్సరాల కాలంగా బెంగళూరు నుంచి ఉత్తరప్రదేశ్ మీదుగా నేపాల్ బస్సులు ప్రయాణిస్తున్నాయి.

● బాధితులకు ఎమ్మెల్యే అనిల్ పరామర్శ

బస్సు ప్రమాదం సంఘటన విషయం తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు జాదవ్ అనిల్ సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించారు. అయితే బస్సును నడుపుతున్న డ్రైవర్ మద్యం తాగి అతివేగంగా బస్సునడుపుతున్నాడని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ప్రైవేట్ సర్వీసుల వల్ల గతంలో సైతం బస్సు ఢీకొని ఒకరు మరణించడం జరిగింది.

లోకేశ్వరం గ్రామ పంచాయతీ అధికారికి సన్మానం

లోకేశ్వరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం గ్రామ పంచాయతీ అధికారిగా భీమ్‌రెడ్డి ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టారు. గ్రామానికి చెందిన మాజీవీడీసీ క్యాషియర్ నవీన్, రమేష్‌గౌడ్, రసూల్, అంబకంటి శ్రీనివాస్, రాజు, భోజన్న, తదితరులు గ్రామ పంచాయతీ అధికారిని ఘనంగా సన్మానించారు.

బీరప్ప దేవాలయం ధ్వంసం చేసిన నిందితులను శిక్షించాలి



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందిస్తున్న కురుమ సంఘం నాయకులు

నర్సాపూర్(జి), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండలం రాయపూర్ కాండ్లీ గ్రామంలోని బీరప్ప దేవాలయం ధ్వంసమైన ఘటనపై గొల్ల కురుమ సంఘం సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు పాల్పడిన దుండగులను తక్షణమే పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరుతూ సంఘం నాయకులు నర్సాపూర్(జి) పోలీసులకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ మేరకు గొల్ల కురుమ సంఘం నాయకులు మ్యాదరి లక్ష్మణ్, పలువురు సభ్యులతో కలిసి నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ ఘటన రాయపూర్ కాండ్లీ గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లోను ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసులు గ్రామాల్లో నిఘా పెంచారు.

ముథోల్ : లోకేశ్వరం మండలంలోని రాయపూర్ కాండ్లీ గ్రామంలో బీరప్ప ఆలయ శిఖర ధ్వంసానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని ముథోల్ తహసీల్దార్ శ్రీలతకు సోమవారం ముథోల్ వీడీసీ, ఉత్సవసమితి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని, దుండగులను తక్షణమే పట్టుకోవాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబసభ్యులకు పరామర్శ

తానూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోంద్రట్ గ్రామంలోని బలోల్లలక్ష్మణ్, కదం భోజాబాయి, అదే విధంగా మండలంలోని భోసి గ్రామం మాజీ ఎంపీటీసీ పిప్పేరా గోపాల్ తల్లి ఇటీవల మృతి చెందడంతో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావుపాటిల్ వారి కుటుంబాలను పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకొని ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈయన వెంట కాంగ్రెస్ నాయకులు శంకర్ చంద్రే, రవీందర్, తుంగేన శంకర్, కృష్ణ, సత్యనారాయణ మాజీ ఎంపీపీ చంద్రకాంత్, మాజీ ఎంపీటీస మధుపాటిల్, అటల్ దేవిదాస్, గోవింద్‌పాటిల్, శ్రీనివాస్, పాండురంగ్ న్నారు.

ఏపీసీసీ మాజీ అధ్యక్షుడికి నివాళి

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణ కేంద్రంలోని మాజీ ఏపీసీసీ అధ్యక్షుడు పొద్దుటూరి నర్సారెడ్డి జయంతి సందర్భంగా వారికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి అంబడి రాజేశ్వర్, మాజీ మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్‌లీడర్ అయ్యన్నగారి పోశెట్టి, యువజన కాంగ్రెస్ నిర్మల్ నియోజకవర్గ అధ్యక్షులు సయ్యద్ అర్షద్ ఉద్దీన్, గాజుల రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కుంటాల, సెప్టెంబరు, 22 : (ఆంధ్రజ్యోతి) : బీడీ సెంటర్‌లో సోమవారం కుంటాల రాజ్‌కమల్ గోడ ప్రతులను ఆవిష్కరించారు. వచ్చేనెల 11, 12 తేదీలలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం నిర్వహించనున్న రాష్ట్ర 2వ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో తెలంగాణ బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిద్ది రాములు పాల్గొన్నారు.



మహాలక్ష్మి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

ఘనంగా బీజేఎల్పీ నేత

పుట్టినరోజు వేడుకలు

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) :బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజా సేవలో నిమగ్నం అవుతూ రాష్ట్ర అభివృద్ధికి పాటుపడడంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని సీఎం ఆకాంక్షించారు. ఈ మేరకు సీఎం కార్యాలయం సోమవారం ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపింది. దసరా నవరాత్రి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా పట్టణంలోని బంగల్‌పేట్ శ్రీ మహాలక్ష్మి ఆలయంలో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి దంపతులు పూజలు చేశారు.

దిలావర్‌పూర్ : మండలంలోని శ్రీ కదిలి పాపహరేశ్వర స్వామిని సోమవారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. అర్చకులు దేవస్థానం సాంప్రదాయ రీతిలో ఎమ్మెల్యే దంపతులకు స్వాగతం పలికారు. శ్రీ పాపహరేశ్వర స్వామిని దర్శించుకుని స్వామివారికి పూజలు చేశారు. అనంతరం దేవస్థానం ఈవో భూమయ్య, జూనియర్ అసిస్టెంట్ మాధవ్ రావు పటేల్, అర్చకులు ఎమ్మెల్యే దంపతులను శాలువాతో సత్కరించి, అమ్మవారి సారెను బహుకరించారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ సీనియర్ నాయకులు డి. ముత్యం రెడ్డి, సత్యం చంద్రకాంత్, నిరంజన్ రెడ్డి, ఏలేటి శ్రీకాంత్ రెడ్డి, సుధాకర్, మధు, జమాల్, ధని నర్సయ్య, కార్యకర్తలు ఉన్నారు.



కదిలిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

మామడ : మండల కేంద్రంలో సోమవారం నిర్మల్ ఎమ్మెల్యే బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీ మండల కార్యాలయాన్ని ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి తనయుడు సృంజిత్ రెడ్డి బీజేపీ నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు బాపు రెడ్డి, కోండ్ర రాజిరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి చిన్న లింగారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మండల ఇన్‌చార్జి సాహెబ్ పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్ : పట్టణంతో పాటు పలు మండల కేంద్రాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. నిర్మల్ పట్టణ అభివృద్ధికి 15 కోట్ల నిధులు, ఎస్‌టీపీ ప్లాంట్‌ల (మురుగు నీటి శుద్ధి కేంద్రాలు) ఏర్పాటుకు 42 కోట్లు మంజూరు అయ్యాయని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. పట్టణంలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి, పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి



మామడలో బీజేపీ కార్యాలయం ప్రారంభిస్తున్న నాయకులు సృంజిత్

బతుకమ్మ సంబరాలు



పాల్గొన్న వైస్ కౌన్సిలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ మహిళా ఉద్యోగులు

ముథోల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా నియోజవకర్గ కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని తరోడా, తదితర గ్రామాల్లో సోమవారం బతుకమ్మ సంబురాలను జరుపుకున్నారు. గునుగు, టేకు పువ్వు, తంగేడు, బంతి రకరకాల పూలను సేకరించి మహిళలు బతుకమ్మలను అందంగా పేర్చి, పూజలు చేశారు. బతుకమ్మ ఆటపాటలతో గౌరమ్మను కొలిచారు. అంతా ఒక్కచోట చేరి బతుకమ్మ సంబురాలు చేసుకున్నారు. కోలాటాలు, బతుకమ్మ పాటలతో సంబరాలు నిర్వహించారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు.

ఆర్జీయూకేటీలో ఘనంగా బతుకమ్మ వేడుక

బాసర : బాసర ఆర్జీయూకేటీలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో విద్యార్థులు మహిళా ఆధ్యాపకులు పాల్గొని సాంప్రదాయబద్ధంగా బతుకమ్మ పండుగలో పాల్గొన్నారు. వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. బతుకమ్మ ప్రాముఖ్యతను వివరించారు. దాదాపు నాలుగు గంటల పాటు బతుకమ్మ పాటలతో విద్యార్థుల కోలాటాలతో యూనివర్సిటీ ప్రాంగణం దద్దరిల్లింది.

కుభీర్ : మండల కేంద్రం కుభీర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బతుకమ్మ పండుగను మహిళలు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పువ్వులతో బతుకమ్మను పేర్చి పూజలు నిర్వహించారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాటలు పడుతూ నృత్యాలు చేశారు. గ్రామంలో శోభయాత్రగా వాగులు, చెరువుల వద్దకు వెళ్లి బతుకమ్మలను నిమర్జనం చేశారు.

భైంసా రూరల్ : మండలంలోని అన్ని గ్రామాల్లో బతుకమ్మ పండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామ గ్రామాల్లో మహిళలు తీరొక్క రంగు రంగుల పూలతో బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాల బంగారు బతుకమ్మ ఉయ్యాల అంటూ డీజే పాటలతో హోరెత్తిస్తున్న మహిళల నృత్యాలు అంబరాన్ని అంటాయి. బతుకమ్మ సంబరాలు చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా కోలాటాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. చెరువులో నిమజ్జనం చేశారు.



బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ముథోల్ చెరువులో బతుకమ్మలు నిమజ్జనం చేస్తున్న దృశ్యం

పాముకాటుతో ఆవు మృతి

కుంటాల, సెప్టెంబరు, 22 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాలకు చెందిన బోనగిరి రవి అనే రైతు ఆవు సోమవారం పాముకాటుతో మృతి చెందింది. బోనగిరి రవి అందకూర్ శివారులో గల తన వ్యవసాయ భూమిలో డైరీఫాం నిర్మించి ఆవులు, గేదెలను పోషిస్తూ ప్రతిరోజు వాటి నుంచి వచ్చిన పాలతో తన జీవనం గడుపుకుంటున్నాడు. మృతి చెందిన ఆవు విలువ రూ. 80 వేలు ఉంటుందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

తానూర్ వైన్స్‌లో చోరీ

తానూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తానూర్‌లో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మద్యం దుకాణంలో వెనుక భాగం నుంచి రేకులను మిషిన్‌తో కోసం మద్యం దుకాణంలోకి చొరబడి లక్ష రూపాయల విలువగల మద్యం 8వేల నగదు దొంగలించినట్లు మద్యం దుకాణంలో పని చేసేవారు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు.

ప్రమాదవశాత్తు ఒకరి మృతి

తానూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉమ్రి గ్రామానికి చెందిన చిలింకర్ మాదవ్(35) ప్రమాదశాత్తు మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉమ్రి(కే) బస్టాప్ వద్ద ఆదివారం రాత్రి కల్వర్టుపైన మాధవ్ మద్యం సేవించి కూర్చుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. వర్షం ఎక్కువగా పడటం వలన వరద ప్రవాహంలో కొద్ది దూరం కొట్టుకుపోయి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు.

కొరటికల్‌లో పిడుగుపాటుకు గోపురం ధ్వంసం

మామడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొరటికల్ గ్రామంలో శరన్నవరాత్రి పర్వదినం రోజున విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయ శిఖరానికి సోమవారం పిడుగు పడడంతో అది పూర్తిగా ధ్వంసమైంది. గోపురం కూడా స్వల్పంగా దెబ్బతిన్నది. ఆ సమయంలో ఎవరూ ప్రమాదానికి గురికాకపోవడంతో గ్రామస్థులు, భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఆకస్మికంగా జరిగిన ఈ ఘటనతో భక్తుల్లో ఆందోళన నెలకొందని గ్రామస్థులు తెలిపారు

యాదిలో..



తీరొక్క పూలతో తొమ్మిది రోజులుగా..

బతుకమ్మ పండగను అత్యంత భక్తితో జరుపుకునే వాళ్లం. తీరొక్క పూలతో తొమ్మిది రోజులుగా జరుపుకునే వాళ్లం. ఊరు, వాడలన్నీ కోలాహలంగా మారేవి. రంగురంగుల పూలు పోగు చేసేందుకు ఎంతో తిరిగేవాళ్లం బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ లయబద్ధంగా పాటలు పాడుతూ ఆడేవాళ్లం.

● నలంద ప్రియ, తహసీల్దార్, భీంపూర్



వేయి కళ్లతో ఎదురుచూసే పండగ..

మహిళలు వేయికళ్లతో ఎదురుచూసే పండగే బతుకమ్మ. 9 రోజుల పాటు సాగనున్న పండగ ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభించి తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మతో ముగిస్తాం. దసరా సెలవుల్లో కుటుంబీకులతో కలిసి స్వగ్రామంలో నిర్వహించే ఈ వేడుకల్లో చిన్ననాటి స్నేహితులతో కలిసి వైభవంగా జరుపుకుంటాం.

● మల్లిక, కస్తూర్బా పాఠశాల ప్రత్యేకాధికారిణి, ఇచ్చోడ



అన్నయ్యలే వెళ్లి పూలు తెచ్చేవారు ..

బతుకమ్మ పండుగను ఎంతో ఘనంగా జరుపుకునే వాళ్లం. పూలను అన్నయ్యలే వ్యవసాయ పొలాలకు వెళ్లి తెచ్చి ఇచ్చేవారు. స్నేహితులతో కలిసి 9 రోజుల పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటాం. ఇప్పటికీ చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకువస్తున్నాయి. ఉద్యోగరీత్యా ఎక్కడికి వెళ్లినా బతుకమ్మ పండుగకు ఇంటికి వెళ్తాను.

● రాధిక, ఎస్ఐ, తలమడుగు



నవరాత్రి ఉత్సవాలకు భారీ బందోబస్తు

భైంసా, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భైంసా పట్టణ పరిధిలో దేవీ శరన్నవరాత్రి వేడుకలకు పోలీసుశాఖ భారీ బందోబస్తు చర్యలు చేపట్టింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావీయకుండా ప్రణాళికలు సిద్ధం చేసింది. గత ఘటనలను దృష్టిలో పెట్టుకొని ఎస్పీ డా.జానకీ షర్మిల, ఏఎస్పీ అవినాష్ కుమార్ నేతృత్వంలో పట్టణ సీఐ గోపినాథ్ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. పట్టణంలోని 26 వార్డులను 2 జోన్లుగా, 4 సెక్టారులుగా విభజించారు. సమస్యాత్మక, వివాదాస్పద ప్రాంతాలతో పాటు ప్రధాన కూడళ్లు, ఆలయాలు, ప్రార్థన మందిరాల వద్ద 12 పోలీసు పికెట్‌లు ఏర్పాటు చేశారు. 4 పెట్రోలింగ్ టీంలను నియమించారు. ఒక్కో జోన్ పరిధిలో ప్రత్యేక అధికారిగా ఎస్ఐ, ఏఎస్ఐ, నలుగురు పోలీసు కానిస్టేబుళ్ల బృందం పర్యవేక్షిస్తున్నారు. అన్ని ప్రాంతాల్లోనూ ప్రతి నిత్యం డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజల్ టీంలు తనిఖీలు, పరిశీలనలు చేపట్టనున్నాయి. అతి సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా కెమెరాలతో నిరంతరం పరిశీలనలు జరుపనున్నారు. సోమవారం టౌన్ సీఐ గోపినాథ్ పట్టణ పరిధిలో దుర్గామాత మండలీల ప్రాంతంలో విస్తృత పర్యటనలు చేపట్టి ఆయా ప్రాంతాల్లో భద్రతా చర్యలను పర్యవేక్షించారు. టౌన్ ఎస్ఐలు నవనీత్‌రెడ్డి, సుప్రియ, నాగభూషణంలతో కలిసి క్షేత్రస్థాయిలో చేపట్టిన బందోబస్తు చర్యలను పరిశీలించారు.

అన్నదాతకు మద్దతు లభించేనా..?

- భారీగా తగ్గుతున్న దిగుబడులు
- మొదలైన పత్తి ఏరే పనులు
- కొనుగోలు కేంద్రాల ప్రారంభమెప్పుడో
- కొర్రీలపై కర్షకుల ఆందోళన

తలమడుగు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మద్దతు ధర.. పత్తి పంట పండించే రైతుకు ఒక అందని ద్రాక్షగానే మిగులుతుంది. గత కొన్నేళ్ల పరిస్థితిని చూస్తే కొనుగోళ్ల ప్రారంభమైన మొదటి వారం రోజుల్లో ఒక్క రైతు కూడా మద్దతు ధరలకు పంటని అమ్ముకున్న దాఖలాలు కానరావు. తేమశాతాన్ని లెక్కగట్టే మిషన్లతో తూకం వేస్తుంటే రైతులు బెంబేలెత్తే పరిస్థితి నెలకొంటోంది. ఆరుగాలం చెమటోర్చి పంటను ఆరబెట్టి తీసుకొస్తే ధరలో కోత విధించడం ఎంతవరకు న్యాయం అంటూ ఆవేదన వ్యక్తం చేసిన ఘటనలే కనిపిస్తాయి. వాతావరణం చల్లగా ఉండి తేమశాతం చూయిస్తే తామేం చేసేదంటూ రైతన్నలు కన్నీళ్లు కార్చిన దృశ్యాలు ఎన్నో మన ఆదిలాబాద్ మార్కెట్లో కనిపిస్తాయి. ఏ వ్యాపారికి, నాయకులకు లేని నిబంధనలు తమకెందుకని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తుంటారు. ఎన్నికల సమయంలో మైకులు పట్టుకొని ప్రసంగించే నాయకులు గాని, రైతుల గోడును ప్రత్యక్షంగా చూస్తున్న అధికారులు గాని వారికి న్యాయం చేయటం దేవుడెరుగు కనీసం ప్రయత్నాలు కూడా చేయరనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

● ఆందోళన చేసినా..

గతేడాది మార్కెట్లో పంట అమ్ముకోవడానికి వచ్చిన వందలాది రైతులు రెండు రోజులు ఆందోళన చేస్తే ఎకరాకు క్వింటాలుకు రూ.400 తక్కువకు అమ్ముకోవాల్సి వచ్చింది. కాగా పత్తి కొనుగోళ్ల అంశంపై వ్యవసాయ శాఖ మంత్రి అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి వచ్చే నెలలో ప్రారంభించాలని ఆదేశాలు ఇచ్చారు. ఇంతవరకూ బాగానే ఉన్నా కొన్నేళ్లుగా అన్నదాతలు అడుగుతున్న మాయిచర్ నిబంధనల సంగతి ఏంటో చెప్పట్లేదనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్భాటంగా మార్కెట్లు ప్రారంభించడం కాదు, క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి పంటవిక్రయాల్లో ఇబ్బందులు పరిష్కరించాలని కోరుతున్నారు.



తలమడుగు మండలంలో పత్తిని ఏరుతున్న కూలీలు

● పంట ఆరబెట్టడం ఒక సవాలే..

ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని పలు గ్రామాల్లో పత్తి ఏరే పనులు మూడు రోజులుగా ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. ఇంటికొచ్చిన పంటను ఆరబెట్టడం, అకాల వర్షాల నుండి రక్షించుకోవడం రైతులకు ఒక సవాలుగా మారింది. అధిక వర్షాల కారణంగా తెగుళ్ల సోకి పత్తి పంట ఎండిపోయి దిగుబడులు తగ్గిపోతున్నాయని వాపోతున్నారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.8,100 ప్రతి రైతుకు అందేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందని కోరుతున్నారు.

రూ.10 వేలతో కొనుగోలు చేయాలి



ఈ ఏడాది అతివృష్టి కారణంగా పంటల దిగుబడి తగ్గిపోయిందని, రైతుల పండించిన పత్తి పంటను క్వింటాల్‌కు రూ.10వేలతో కొనుగోలు చేయాలి. మాయిచర్ పేరిట కోతలు లేకుండా పత్తి పంటను అధికారులు కొనుగోలు చేయాలి.

● నల్ల పద్మాకర్‌రెడ్డి, రైతు, తలమడుగు

యూరియా కోసం వెళ్తే గెంటేశారు

కడెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో సోమవారం యూరియా కోసం వెళ్తే పీఏసీఎస్ సీఈవో మెడపట్టి గెంటేశాడని ఆరోపిస్తూ మాజీ సర్పంచ్, ఓ రైతు కడెంలో ఆందోళన చేశారు. ఆందోళన చేస్తున్న రైతులకు బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ సంఘీభావం తెలిపారు. అనంతరం పీఏసీఎస్‌కి వెళ్లి రైతులకు యూరియా అందించాలని అధికారులను కోరారు.



అధికారులతో మాట్లాడుతున్న జాన్సన్ నాయక్

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం

పెంబి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెంబి తండా గ్రామానికి చెందిన కే.చందనకు ఇటీవల ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన పూర్వ విద్యార్థికి వివేకానంద పాఠశాలలో శాలువాతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో రాణించాలని, అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పుప్పాల మల్లేష్, పాఠశాల ఛైర్మన్ ఎం. చిన్నయ్య, కరస్పాండెంట్ పుప్పాల సుజాత, ప్రిన్సిపాల్ భూక్యా కైలాష్, సలహాదారుడు పాకాల ప్రవీణ్, తదితరులు ఉన్నారు.



చందనను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మంచి ఆహార అలవాట్లు చేసుకోవాలి

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్ వ్యాధుల బారిన పడకుండా మంచి ఆహారపు అలవాట్లు చేసుకోవాలని డాక్టర్ రవి అన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాంనగర్‌లో ఆరోగ్య మహిళ శక్తివంతమైన కుటుంబం కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజు 30 నిమిషాలు నడవాలని, యోగా, వ్యాయామం చేయాలని, మధ్య మధ్యలో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా.తేజస్విని, మెడికల్ ఆఫీసర్, హెల్త్ సూపర్‌వైజర్లు, మతీన్, రమణ, ఆరోగ్య కార్యకర్తలు నాగమణి, సునంద, శారద, ఆశాలు, మహిళలు పాల్గొన్నారు.

ఐక్యతతో హక్కులను సాధిద్దాం

● ఖానాపూర్‌కు చేరిన విశ్వబ్రాహ్మణ యాత్ర

ఖానాపూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఐక్యతతో విశ్వబ్రాహ్మణుల హక్కులను సాధిద్దామని విశ్వకర్మ నాలెడ్జ్ ఫౌండర్ విశ్వనాథుల పుష్పగిరి పిలుపునిచ్చారు. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ నుండి ఈ నెల 17వ తేదీన ప్రారంభమైన విశ్వబ్రాహ్మణ చైతన్య యాత్ర సోమవారం ఖానాపూర్ చేరింది. స్థానికంగా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణుల హక్కుల సాధన కోసం తమ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. రాష్ట్రంలో 10 మంది సభ్యులతో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్పొరేట్ జ్యువెలరీ కంపెనీల నుండి రాయల్టీ పన్నులను వసూలు చేసి విశ్వబ్రాహ్మణుల సంక్షేమం కోసం ఉపయోగించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో జనాభా లెక్కల ప్రకారం ఐదు శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ యాత్రను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించి నవంబరు 20వ తేదీన హైదరాబాద్‌లో ముగింపు సభ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కామోజీ శ్రీనివాస్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ కడార్ల గంగనర్సయ్య, ఆలయ కమిటీ బృందం వెంకటాద్రి, రాజేశ్వర్, శేఖర్, రవితేజ, పాలిక్ శ్రీనివాస్, అజయ్, తదితరులున్నారు.



తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న సంఘం నాయకులు

ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతంగా అమలుచేయాలి

సోన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజాఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డా.రవీందర్ నాయక్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. కార్యక్రమాల వారీగా లక్ష్యాలను సాధించడానికి పలు సూచనలను, సలహాలను అందించారు. అంతకుముందు జిల్లాలోని సోన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నియంత్రణ, నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.రాజేందర్, కార్యక్రమం నిర్వహణ అధికారులు డా.రాజా రమేష్, డాక్టర్ నయనారెడ్డి, డాక్టర్ ఆశిష్ రెడ్డి, డాక్టర్ సౌమ్య, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, డీపీవో రామ్‌చందర్, తదితరులు పాల్గొన్నారు.



సోన్ పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డైరెక్టర్

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి


పెంబి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని ఖానాపూర్ బీఆర్ఎస్ నియోజకవర్గ భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. సోమవారం ఖానాపూర్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఈ నెల 24 నుంచి జరిగే క్రికెట్ టోర్నీలో పాల్గొనే క్రికెట్ జట్టు పెంబి సూపర్ స్ట్రైకర్, రెయిన్‌బో వారియర్స్ జట్ల క్రీడాకారుల టీ షర్ట్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలు ఆరోగ్యంగా, స్నేహభావంతో ఉండటానికి దోహదపడతాయని అన్నారు. అనంతరం క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శేఖర్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ గంగారెడ్డి, రాజేంద్రప్రసాద్ ఉన్నారు.



క్రీడాకారుల టీ షర్ట్ ఆవిష్కరిస్తున్న జాన్సన్ నాయక్

ఆదివాసీ గ్రామాలను ఆదుకుంటా: ఎమ్మెల్యే

సిరికొండ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదివాసీ గ్రామాలన్నింటినీ అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం సిరికొండ మండలం ధర్మాసాగర్ గ్రామపంచాయతీ పరిధిలోని లేండీగూడ గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కంచం లక్ష్మణ్, ఏఎంసీ డైరెక్టర్ ప్రకాష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ని మర్యాద పూర్వకంగా కలిసి, తమ గ్రామానికి ప్రత్యేకంగా 25 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. మండలంలోని ఆదివాసీ పల్లెల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి, వాటిని అభివృద్ధి పథంలో తీసుకెళ్ళేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన లేండిగూడ గ్రామస్థులు

దుర్గమ్మా.. కరుణించమ్మా

- ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు
- ప్రసిద్ధ ఆలయాల్లో భక్తుల తాకిడి..
- పెద్దఎత్తున భవానీ దీక్షలు

ఆదిలాబాద్ టౌన్, నేరడిగొండ, బజార్‌హత్నూర్ సెప్టెంబరు 22 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. దసరా పర్వదినం ముందు 9 రోజులు దుర్గా మాతకు భక్తిశ్రద్ధల నడుమ పూజలు జరపడం ఆనవాయితీగా వస్తున్న నేపథ్యంలో వేడుకలను ఘనంగా జరపనున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధానవీధుల్లో అమ్మవారు కొలువయ్యారు. సోమవారం ఉదయం నుంచే బ్యాండ్ మేళాలు, అమ్మవారి కీర్తనల నడుమ ప్రతిమలను మండపాలలో ప్రతిష్ఠించారు. పట్టణంలోని బొజ్జ వార్ ఆలయంలో దుర్గమాత విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్ఠించి పల్లకీ సేవ సైతం చేపట్టరు. ముందుగా పల్లకీకి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ప్రధాన వీధుల గుండా భక్తి కీర్తనల మధ్య దేవీ ఆగమన శోభాయాత్ర జరిపారు. విగ్రహాన్ని ప్రతిష్ఠించి వేద పండితుల మంత్రోచ్ఛరనల నడుమ ప్రత్యేక పూజలను జరిపించారు. నవరాత్రులను పురస్కరించుకుని చేపట్టే ప్రత్యేక పూజలు, బతుకమ్మ సంబరాలు, దుండియా నృత్యాల సందడితో ఎటు చూసిన ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ప్రముఖ ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. స్థానిక నవశక్తి దుర్గామాత ఆలయం, చౌడేశ్వరి దేవీఆలయం, గ్రీన్‌వ్యాలీలోని త్రిశక్తి మాత ఆలయం, వాసవి కన్యక పరమేశ్వరి దేవి ఆలయం, తిర్పెల్లి లోని కాళీమాత ఆలయాల్లో భక్తుల తాకిడి కనిపించింది. ప్రధాన అర్చకుల నే తృత్వంలో పూజాది కార్యక్రమాలను భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భారీ ఎత్తున భక్తులు భవాని దీక్షలు స్వీకరించి అమ్మవారిని ఆరాధించారు. అనంతరం ప్రదక్షిణలు చేస్తూ మొక్కులు తీర్చుకున్నారు. ఇక దేవీ శరన్నవరాత్రుల దృష్ట్యా 9 రోజులు భక్తులు ఉపవాస దీక్షలను ఆచరించనున్నారు.



నవశక్తి దుర్గామాత ఆలయంలో అమ్మవారు

● దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం నేరడిగొండ మండలంలోని తన స్వగ్రామమైన రాజురా గ్రామంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలపై దుర్గాదేవి ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు.



రాజూరలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



పూజలు జరుపుతున్న వేద పండితులు..



నవశక్తి ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



త్రిశక్తి ఆలయంలో పూజలు చేస్తున్న దీక్షాధారులు



నేరగొండలో కొలువైన అమ్మవారు

గోదావరికి పోటెత్తిన భక్తులు

సోన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి దుర్గా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో భవాని మాలధారణ చేపట్టే దీక్షాపరులు సోన్ గోదావరిలో పుణ్య స్నానాలను ఆచరించారు. గోదావరి స్నానాలు చేసి మాల వేసుకున్నారు. భక్తులు భారీగా తరలి రావడంతో గోదావరి ఘాట్లు కిక్కిరిసి పోయాయి.

11వ రోజుకు చేరిన సమ్మె

ఉట్నూర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో దినసరి ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరవధిక సమ్మెకు లంబాడీ జేఏసీ నాయకులు మద్దతు పలికారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదురుగా చేస్తున్న సమ్మె 11 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్‌జగన్‌నాయక్ మాట్లాడుతూ.. ఒక నెల జీతం ఆలస్యం అయితేనే ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నో ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతారని అలాంటిది ఏడు మాసాలుగా వేతనాలు ఇవ్వక పోవడం విడ్డూరమన్నారు. దశాబ్దాలుగా పనిచేస్తున్న దినసరి ఉద్యోగులలో అర్హులైన వారిని రెగ్యూలర్ చేయాలని డిమాండ్ చేశారు. లంబాడీ జేఏసీ నాయకులు రాందాస్, రామారావు, ప్రజా సంఘాల నాయకులు ప్రజ్ఞాశీల్, జాడి వెంకటేశ్‌లతో పాటు దినసరి ఉద్యోగుల సంఘం నాయకులు ఏరుకొండ రాజన్న, రాథోడ్ బాపురావు, బాపు తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమాలో మోసం

నర్సాపూర్(జి), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో సంచలనం సృష్టించిన రైతుబీమా కుంభకోణంపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసులో ఫోర్జరీ సంతకాలు, నకిలీ పత్రాల వ్యవహారం బయటపడటంతో పోలీసులు మండల వ్యవసాయ అధికారి రాంచందర్ నాయక్‌ను విచారించారు. కాగా ఆయన అందించిన కీలక సమాచారం ఆధారంగా ఫోర్జరీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

● ఆర్‌టీఐలో బయటపడిన మోసం...

మండలకేంద్రానికి చెందిన దూసముడి సవీన్ కుమార్ 2021 సెప్టెంబరు 9న ఈ విషయమై సమాచార హక్కు చట్టం(ఆర్‌టీఐ) కింద మండల వ్యవసాయ కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్నారు. నిర్ణీత గడువులోగా సమాచారం ఇవ్వకపోవడంతో 2021 అక్టోబరు 28న సవీన్ కుమార్ జిల్లా వ్యవసాయ అధికారికి మొదటి అప్పీలును దాఖలు చేశారు. నాలుగేళ్లుగా సమాచారం అందకపోవడంతో తెలంగాణ ఇన్ఫర్మేషన్ కమిషన్ ఈ విషయంలో జోక్యం చేసుకుంది. 2025 ఆగస్టు 1న తెలంగాణ ఇన్ఫర్మేషన్ కమిషన్ దూసముడి సవీన్ కుమార్, అప్పటి మండల వ్యవసాయ అధికారి జాదవ్ సాయి కిరణ్, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్‌లను 2025 ఆగస్టు 13న మధ్యాహ్నం 2 గంటలకు డిస్ట్రిక్ట్ కలెక్టర్ కార్యాలయంలో హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది. కమిషన్ విచారణలో అప్పటి మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ కుటుంబ సమస్యల వల్ల సమాచారం ఇవ్వడంలో జాప్యం జరిగిందని అంగీకరించారు. ఈ విచారణ అనంతరం సవీన్ కుమార్ కోరిన సమాచారం పూర్తిగా అందించబడింది. దీంతో రైతుబీమా మోసం వెలుగులోకి వచ్చింది.

● నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం

పోలీసులు, ప్రస్తుత మండల వ్యవసాయ అధికారి రాంచందర్ నాయక్ వెల్లడించిన వివరాల ప్రకారం... 2018లో విదేశంలో మరణించిన కోడె ముత్యం పేరున 2019 జనవరి 9న రైతుబీమా ఎన్రోల్మెంట్ చేశారు. ఆ తర్వాత కోడె ముత్యం పేరు మీద ఉన్న నర్సాపూర్ శివారులోని 618 సర్వే నంబర్లో గల ఎకరం 16 గుంటల భూమిని ఆయన భార్య సత్యవ్వ లోలం పోశెట్టికి విక్రయించారు. అయితే నర్సాపూర్ భూమి పత్రాలు (పట్టా పాస్ బుక్ నెంబర్ టీ 14130120283) సరిగ్గా లేకపోవడంతో 2019 ఆగస్టు 13న ఆన్‌లైన్ ద్వారా ఎల్ఐసీ కార్యాలయం నుంచి దరఖాస్తు వెనక్కి వచ్చింది. ఆ సమయంలో చాక్‌పల్లి క్లస్టర్‌కు ఏఈవోగా ఉన్న కాల్వ రమ్య వద్దకు ఈ ఫైల్ తిరిగి వచ్చింది. ఇతర గ్రామాల్లో భూమి ఉంది. ఆధార్ ఐడీ ఇప్పటికే నమోదైంది. వంటి కారణాలను చూపుతూ ఎల్ఐసీ ఫైల్‌ను వెనక్కి పంపింది. ఆ తర్వాత ఫైల్‌లో ఉన్న కారణాలను సరిదిద్ది, పట్టా నెంబర్ (టీ 14130120280)ను సరిచేసి తిరిగి పంపించారు. ఈ మొత్తం వ్యవహారం జరిగినప్పుడు జాదవ్ సాయికిరణ్ మండల వ్యవసాయ అధికారిగా ఉన్నారని ప్రస్తుత అధికారి రాంచందర్ నాయక్ స్పష్టం చేశారు. ఏదేమైనా ఈ మోసం లో ప్రమేయం ఉన్నవారు త్వరలోనే బయట పడతారని ప్రస్తుత మండల ఆయన తెలిపారు. ఈ దర్యాప్తులో ఆయన సహకారం, అందించిన సమాచారం కీలకంగా మారాయి. త్వరలోనే ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేసే అవకాశం ఉందని పోలీసు వర్గాలు వెల్లడించాయి.



TELANGANA INFORMATION COMMISSION

NOTICE

దరఖాస్తుదారుడికి, ఇద్దరు అధికారులకు అందించిన నోటీసు దృశ్యం

వెంకన్న ఆలయంలో చోరీ

తలమడుగు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తిరుపతిగా అభివృద్ధి చెందుతున్న తలమడుగు మండలంలోని బరంపూర్ వెంకటేశ్వర ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు తాళాలు పగలగొట్టి చోరీ చేసినట్లు ఆదిలాబాద్ సీఐ ఫణిందర్, ఎస్సై రాధికలు తెలిపారు. వివరాలు.. బరంపూర్ కొండపై స్వయంభుగా వెలసిన శ్రీ వెంకటేశ్వర ఆలయంలో ఆదివారం గుర్తు తెలియని దుండగులు చొరబడి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారన్నారు. సోమవారం ఉదయం ఆలయ పూజారి, గ్రామస్థులు పూజకు రాగా ఆలయ తలుపులు పగలగొట్టి చిందరవందంగా పడి ఉండడంతో వెంటనే ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పోలీసులు క్లూస్ టీంతో వచ్చి పరిశీలించారు. ఆలయంలోని శట గోపురం. నగదు అన్ని కలిపి రూ. ఐదు వేల వరకు చోరి జరిగినటు తెలిపారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని వారు పేర్కొన్నారు.



ఆలయాన్ని పరిశీలిస్తున్న సీఐ ఫణిందర్, ఎస్ఐ రాధిక

ఆధ్యాత్మిక చింతన కోసమే ఆలయాలు

బోథ్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతన కోసమే ఆలయాలు అవసరమని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం సోనాలలో సంత్ సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపనకు తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అనిల్ సహకారంతో సేవాలాల్ విగ్రహాలను ప్రతిష్ఠాపిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం ఉంటుందని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, స్థానిక నాయకులు తుల హరీష్, ఈర్ల అభిలాష్, అంజిలతో పాటు బంజారా సంఘం నాయకులు రాథోడ్ భగవాన్ దాస్, జాదవ్ రామ్ కిషన్, బాబూలాల్, గులాబ్ సింగ్ రాథోడ్, నారాయణ, భీమ్రావు, రామారావు యాదవ్, నానాజీ రాథోడ్, దిక్కులాల్, తదితరులు ఉన్నారు.



బొజ్జావర్ ఆలయంలో కొలువైన దుర్గమ్మ

దుర్గమ్మా.. కరుణించమ్మా

● జిల్లాలో ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

మరిన్ని వివరాలు 7వ పేజీలో....

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి : ఆదివాసీలు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఆదివాసీ సంఘాల నేతలు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): చట్టబద్దత లేని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ... ఆదివాసీ సంఘాల నాయకులు భారీ ధర్నా నిర్వహించారు. తొమ్మిది తెగల ఆదివాసీలు, రాయిసెంటర్ సార్‌మేడీలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. సంప్రదాయ డోలు వాయిద్యాలతో ముందుగా ర్యాలీ నిర్వహించిన అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన నినాదాలతో హోరెత్తించారు. అంతకుముందు ఆదిలాబాద్ రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఇక్కడ అధికారులకు వినతిపత్రం అందించి అక్కడి నుంచి ర్యాలీగా కొమురం భీం చౌక్‌కు చేరుకుని భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో స్రవంతి అక్కడికి చేరుకొని మాట్లాడానికి యత్నించినా ఫలితం లేకుండా పోయింది. కలెక్టర్ వచ్చి తమకు సమాధానం ఇవ్వాలని నేతలు పట్టుబట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘం నాయకులు గణేష్ మాట్లాడుతూ... ప్రధాన రంగాల్లో 40 ఏళ్లుగా తమకు వచ్చిన అవకాశాలను బంబాడీలు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. సుప్రీం కోర్టు తీర్పు వెలువడేంత వరకు లంబాడీలకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయొద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు గణేష్, తనాజీ, వెంకటేష్, సోనేరావ్, జగు పటేల్, విశ్వంబర్ పాల్గొన్నారు.

సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో విజయ దశమి వేడుకలు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమితి అధ్యక్షుడు ప్రమోదకుమార్ ఖత్రి అన్నారు. సోమవారం డైట్ గ్రౌండ్ లో రావణ దహన స్థలాన్ని పరిశీలించారు. సమితి సభ్యులతో పలు విషయాలపై చర్చించి ఏర్పాట్ల గురించి మాట్లాడారు. భక్తులు విజయదశమి ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గేడం మాదవ్, సూర్యకాంత్, కందుల రవీందర్, లోలపు శ్రీనివాస్, కృష్ణ, సురేందర్, సత్యం, వేణు, మహిపాల్, నర్సిములు, దశరత్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి.. వారిపై పని భారాన్ని తగ్గించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్మికుల సమస్యలపై చర్చించి పలు విషయాలను తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ మాట్లాడారు. సమస్యలు పరిష్కారం కానీ పక్షంలో యూనియన్ తరపున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజేంగుల రాజు, మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంతెన కాంతరావు, చిరంజీవి, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సందడిగా బతుకమ్మ వేడుకలు

బజార్ హత్నూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం ఆడపడుచులు, మహిళల బతుకమ్మ పండగ సంబరాలు సందడిగా సాగాయి. వాడవాడలా ఉన్న బతుకమ్మలను ఒక దగ్గర చేర్చి గౌరమ్మకు పూజలు చేశారు. కోలాటం, చప్పట్లతో బతుకమ్మ పాటలు పాడుతూ... అనంతరం కడెం వాగులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



బజార్‌హత్నూర్ మండలంలో వాగు వద్ద బతుకమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు



● ఆదిలాబాద్ రూరల్ మండలంలోని గ్రామం

రిజర్వేషన్ల ఖరారుపై.. కసరత్తు

» స్థానిక ఎన్నికలకు సన్నద్ధం అవుతున్న అధికారులు

» నేటి సాయంత్రంలోగా రిజర్వేషన్ల ఖరారుకు అవకాశం

» ఆశావహ నేతల్లో మొదలైన ఉత్కంఠ

» ఇక రసవత్తరంగా మారనున్న పల్లె రాజకీయం

“ అందరూ.. ఆసక్తిగా ఎదురుచూస్తున్న స్థానిక ఎన్నికల రిజర్వేషన్ల ఖరారుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా, డీపీవో, ఎంపీడీవో, డీఎల్‌పీవో, ఎంపీవోలతో రిజర్వేషన్ల ఖరారుపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం విధి విధానాలను ప్రకటించడంతో రిజర్వేషన్‌లను ఖరారు చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడుతూ వస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తుంది. సెప్టెంబరు 30లోగా స్థానిక ఎన్నికలను నిర్వహించాలని గతంలోనే హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే ఈనెల చివరిలోగా నోటిఫికేషన్‌ను విడుదల చేసేందుకు ప్రభుత్వం హడావిడి చేస్తునట్లు అధికారులు పేర్కొంటున్నారు. ”

మొత్తం గ్రామ పంచాయతీలు	: 473
మొత్తం వార్డుల సంఖ్య	: 3,870
మొత్తం ఓటర్లు	: 4లక్షల 47వేల 135
మహిళా ఓటర్లు	: 2లక్షల 28వేల 436
పురుష ఓటర్లు	: 2లక్షల 18వేల 683
ఇతరులు	: 16 మంది

ఆదిలాబాద్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గతంలో మాదిరిగానే రిజర్వేషన్లు ఉంటాయా? లేదా? ఏమైనా మార్పులు చేర్పులు చోటు చేసుకుంటాయా? అనే ఆసక్తి అంతటా కనిపిస్తోంది. మొదట వార్డు రిజర్వేషన్ల తర్వాత సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్లను ఖరారు చేసే అవకాశం ఉంది. మంగళవారం సాయంత్రం లోగా రిజర్వేషన్లను ఖరారు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారవర్గాల్లో హడావిడి మొదలయ్యింది. జిల్లాలో 473 సర్పంచ్ స్థానాలు, 3870 వార్డులు, 168 ఎంపీటీసీ, 20 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. జడ్పీటీసీ, ఎంపీటీసీ రిజర్వేషన్లను జిల్లా కలెక్టర్, సర్పంచ్ స్థానాలను ఆర్డీఓ, వార్డు రిజర్వేషన్లను ఎంపీడీఓలు ఖరారు చేస్తారు. మొత్తానికి రిజర్వేషన్ల ఖరారు తర్వాత పల్లె రాజకీయాలు మరింత హీటెక్కనున్నాయి.

మొత్తం మండలాలు	: 21
ఎంపీటీసీల సంఖ్య	: 168
జడ్పీటీసీల సంఖ్య	: 20
ఎంపీపీల సంఖ్య	: 20

ఏజెన్సీ పంచాయతీలు 251

జిల్లాలో మొత్తం 473 గ్రామ పంచాయతీలకు గాను 251 ఏజెన్సీ గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అలాగే 100 శాతం గిరిజన జనాభా కలిగిన గ్రామ పంచాయతీలు మరో 15 ఉన్నాయి.మొత్తం 266 గ్రామ పంచాయతీలలో సర్పంచ్ స్థానాలు ఎస్టీ రిజర్వుడు కానున్నాయి. ఏజెన్సీలో ఎంపీటీసీ, వార్డులకు 50శాతం రిజర్వేషన్ కల్పించనున్నారు. కులగణన సర్వే ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ను కల్పించనున్నారు.దీంతో ఈ సారి బీసీ సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీల సంఖ్య పెరగనుంది. అలాగే జనరల్ స్థానాల్లోనూ బీసీలు పోటీ చేసే అవకాశం కల్పిస్తుంది.

రిజర్వేషన్లపై టెన్షన్ టెన్షన్

రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ ప్రారంభంకావడంతో ఆశావహ నేతల్లో టెన్షన్ మొదలయ్యింది. మంగళవారం సాయంత్రంలోగా రిజర్వేషన్లు ఖరారుకు అవకాశం ఉన్నందున అంతటా ఉత్కంఠ కనిపిస్తుంది. ఈసారి అనుకూలమైన రిజర్వేషన్ వస్తుందో రాదోనన్న ఆందోళన మొదలయ్యింది. ఒక వేళ రిజర్వేషన్ అనుకూలంగా రాకుంటే ఇన్నాళ్లు పడిన శ్రమంతా వృథా అయ్యే అవకాశం ఉందంటున్నారు. కలిసి వస్తే సర్పంచ్ లేదంటే ఎంపీటీసీ, జడ్పీటీసీ అనే ఉద్దేశంతో పలువురు ఆశావహ నేతలు కనిపిస్తున్నారు. ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో 5నుంచి 10 మంది సర్పంచ్‌గా పోటీ చేసేందుకు సిద్దమవుతున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ ప్రధాన పార్టీల మద్దతుతో పాటు ఇతర వ్యక్తులు ఎన్నికల బరిలో దిగేందుకు సిద్ధమవుతున్నారు. జనాభా ప్రతిపాదికన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే అవకాశం ఉన్నందున కొన్ని స్థానాలు తారుమారయ్యే అవకాశం ఉందంటున్నారు.

అప్రమత్తమైన పార్టీలు

స్థానిక ఎన్నికల కసరత్తు మొదలు కావడంతో ప్రధాన రాజకీయ పార్టీలు అప్రమత్తమైనట్లు

(తరువాయి 6వ పేజీలో....)

రిజర్వేషన్ల ఖరారుకు కసరత్తు చేస్తున్నాం

: రమేష్, జిల్లా పంచాయతీ అధికారి, ఆదిలాబాద్



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సర్పంచ్, వార్డు స్థానాలకు గాను రిజర్వేషన్ల ఖరారుకు కసరత్తు చేస్తున్నాం. మంగళవారం సాయంత్రం వరకు రిజర్వేషన్ పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనికి సంబంధించిన విధి విధానాలు కూడా ఖరారయ్యాయి. త్వరలోనే రిజర్వేషన్లు ఫైనల్ చేసి అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంటుంది.

సంస్కృతి, సంప్రదాయాలను చాటేలా బతుకమ్మ సంబరాలు : కలెక్టర్

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బతుకమ్మ పండుగను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈనెల 23వ తేదీ నుంచి ఆయా శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను జరపనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలకు సంబంధించి ఎస్సీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ శాఖలో మంగళవారం సాయంత్రం 4గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. జిల్లాలో బతుకమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బతుకమ్మ పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారుల సమన్వయంతో జిల్లావ్యాప్తంగా బతుకమ్మ పండుగ నిర్వహించాలని పేర్కొన్నారు. బతుకమ్మ సంబరాలకు కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో అదనపు కలెక్టర్ చైర్మన్‌గా, డీడబ్ల్యూఓ, ఎస్సీ డెవలప్‌మెంట్, ప్రజా సంబంధాల శాఖ, రూరల్ డెవలప్‌మెంట్, మున్సిపల్, యూత్ శాఖల అధికారులను సభ్యులుగా నియమించినట్లు వెల్లడించారు.

గిరిజనుల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం : ఐటీడీఏ పీవో

ఉట్నూర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం ఐటీడీఏలో నిర్వహిస్తున్న గిరిజన దర్బార్‌కు సమస్యలు తెలుపుతున్న గిరిజనుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం జరుగుతుందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా గిరిజనుల సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులు ఆయా శాఖల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటాయని తెలిపారు.

ఫిర్యాదుల పట్ల బాధ్యతగా వ్యవహరించి పరిష్కారం చూపాలి

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీసు ముఖ్య కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు ఎస్పీకి ఫిర్యాదలను అందించగా.. పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలిచ్చి సమస్యల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు. కాగా, ఎస్పీకి 43 ఫిర్యాదుదాలు అందాయి. 'మెసేజ్ యువర్ ఎస్పీ'కి ఫోన్ నెం. 8712659973 వాట్సాప్ ద్వారా సమాచారం కానీ, ఫిర్యాదులను కానీ తెలియజేయవచ్చని ఎస్పీ పేర్కొన్నారు

మహోర్ పుణ్యక్షేత్రం నుంచి కాగడ హారతి



మహోర్ నుంచి కాగడ హారతితో తిరిగి వస్తున్న శాంతినగర్ భక్తులు

భీంపూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్లి(టీ) అనుబంధ గ్రామం అయిన శాంతినగర్‌కి చెందిన కొలాం గిరిజన ఆదివాసీ భక్తులు మహారాష్ట్రలోని మహోర్‌లోని పుణ్యక్షేత్రం రేణుకమాత అయలానికి పాదయాత్రగా వెళ్లి మాతను దర్శించుకొని కాగడా హారతితో సోమవారం శాంతినగర్‌కి చేరుకున్నారు. వారికి గ్రామస్తులు డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికి కాగడా హారతి తో నవరాత్రులు ప్రారంభించారు.

వేతనాల కోసం ఆసుపత్రి ముందు నిరసన

ఉట్నూర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా కేంద్రాసుపత్రి ముందు వేతనాల కోసం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నిరసన తెలిపారు. సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి బొంకంటి సుభాష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ మరియు పారిశుద్యం కార్మికులు కలిసి ఆసుపత్రి ముందు 4నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సుభాష్‌బొంకంటి మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన ప్రభుత్వ అధికారులకు నాలుగు నెలల పెండింగ్ జీతాలువిడుదల ఈ నెల 13 వరకు చెల్లించకుంటే 16న మహాధర్నా చేస్తామని వినతిపత్రం సమర్పించిన స్పందించడం లేదన్నారు. ఈ నెల 16 తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు మహాధర్నా హైదరాబాద్‌లో నిర్వహించడం జరిగిందని, అలాగే రెండు, మూడు రోజుల్లో ఉన్నతాధికారులు అదేరోజు ఉన్నత హామీ ఇచ్చినప్పటికీ వారం రోజులు అధికారులు కేవలం రెండు, మూడు ఆమె నెరవేర్చలేదని అన్నారు. మరో రెండు రోజుల్లో వేతనాలు ఇవ్వకుంటే భవిష్యత్ కార్యాచరణ రూపొందించి ఉద్యోగం తీవ్రస్థాయిలో చేస్తామని సుభాష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారానికి సత్వర చర్యలు

● అర్జీలను స్వీకరించిన అదనపు కలెక్టర్ శ్యామల దేవి ● కలెక్టరేట్‌లో ప్రజావాణి ● నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన కలెక్టర్

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ శ్యామల దేవి సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు అందించిన వినతులను స్వీకరించి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించినట్లు అదనపు కలెక్టర్ శ్యామల దేవి తెలిపారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు సూచనలు చేశారు. వినతులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికపుడు పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కార్యాలయాల మార్పు

ఆదిలాబాద్ టౌన్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కలెక్టరేట్‌లోని పైఅంతస్తు కూలిపోయిన నేపథ్యంలో నిపుణుల కమిటీ సూచనల మేరకు అధికార యంత్రాంగం తదుపరి చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే కలెక్టరేట్‌లోని పలు విభాగాలను ఇతర కార్యాలయాల్లో తరలించాలని కలెక్టర్ ఆదేశించడంతో.. అదనపు కలెక్టర్ కార్యాలయాన్ని పెన్‌గంగ భవన్‌కు మార్చారు. సోమవారం కలెక్టర్ రాజర్షి షా పూజలు చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం అదనపు కలెక్టర్ ను సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు, అధికారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పలు కార్యాలయాలను మార్చడం జరిగిందన్నారు. అదనపు కలెక్టర్, రెవెన్యూ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఏ, బీ,సీ, డీ, ఈ, ఎఫ్ సెక్షన్‌లు ఇలా 8 విభాగాల కార్యాలయాలు పెన్ గంగ భవనంలోని మార్చడం పూర్తయ్యిందని, ఇకపై ఇక్కడి నుంచే కార్యకలాపాలు జరుగుతాయన్నారు. కలెక్టర్ చాంబర్‌తో పాటు డీపీఆర్డీవో, ట్రెజరీ కార్యాలయాలకు ఎలాంటి ముప్పు లేదన్నారు. అదనపు కలెక్టర్‌లు శ్యామలదేవి, రాజేశ్వర్, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్, శిక్షణ కలెక్టర్ సలోని చబ్ర, ఆర్డీవో స్రవంతి పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

డోర్లి వ్యవసాయ పంటపొలాల్లో పులి అడుగు జాడలు

● సమాచారం అందించిన రైతులు

తలమడుగు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని డోర్లీ వ్యవసాయ పొలాల్లో పులి సంచరిస్తున్నట్లు అడుగుజాడలు కనబడడంతో రైతులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో వెంటనే స్పందించిన అటవీశాఖ అధికారులు డోర్లీ వ్యవసాయ పరిసర ప్రాంతాల్లో పొలాల్లో పర్యటించి పులి అడుగుజాడలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ పొలాల్లో కనపడుతున్న అడుగు జాడలు చిరుత పులి లేదా అడవి పిల్లులు అడుగు జాడలు అని వారు తెలిపారు. రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని పెద్దపులి సంచారం లేదని వారు తెలిపారు.



డోర్లి శివారులో లభ్యమైన పులి అడుగు జాడలు